క్లుప్తంగా

పోచమ్మకు ప్రత్యేక పూజలు

ఇచ్చోడ: మండలంలోని కోకస్‌మన్నూర్‌లో గురువారం పోచమ్మతల్లి విగ్రహాలకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. జాములమావాస్య సందర్భంగా ఆలయాన్ని శుద్ధి చేశారు. అనంతరం నూతన వస్త్రాలతో అలకరించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతీ ఏటా జాముల అమవాస్య సందర్భంగా గ్రామస్తులు పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేయడం అనావాయితీగా వస్తుంది. ప్రతిఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని మొక్కుకున్నారు.

పీచరలో వైద్యశిబిరం


మందులను అందజేస్తున్న వైద్య సిబ్బంది

నేరడిగొండ: మండలంలోని పీచర గ్రామంలో నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్ తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు గ్రామస్తులకు రక్తపోటు, మధుమేహం, హెమోగ్లోబిన్ వంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌ఎం కల్పన, హెల్త్ అసిస్టెంట్ శ్రీకాంత్, ఆశ కార్యకర్త కౌశల్య పాల్గొన్నారు.

పుస్తకాలు చదివేలా విద్యార్థులను ప్రోత్సహించాలి


మాట్లాడుతున్న విజయలక్ష్మి

ఇచ్చోడ: విద్యార్థులు గ్రంథాలయ పుస్తకాలు చదివేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయలక్ష్మి అన్నారు. గురువారం కోకస్‌మన్నూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాలలో గ్రంథాలయ కమిటీలు ఏర్పాటు చేసి విద్యార్థులతో పఠన శక్తిని పెంపొందించే విధంగా కృషి చేయాలని కోరారు. అకాడమిక్ అంశాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. సమావేశంలో డీఆర్పీ అరుణ, బుచ్చిబాబు, సీఆర్పీ శ్యాంసుందర్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: ఐటీఐ కళాశాలలో రెండో విడత ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31 వరకు గడువు ఉందని పేర్కొన్నారు. ఎన్‌సీవీటీ ప్యాట్రన్ కింద ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ ట్రేడ్‌లలో శిక్షణ పొందడానికి పదో తరగతి, 8వ తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 85007 47308 సంప్రదించాలని కోరారు.

వేధిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలి

భీంపూర్: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల కళాశాలలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా, సోషల్ మీడియా, బాల్య వివాహాలు, సైబర్ మోసాలు, బాల కార్మిక వ్యవస్థపై విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ఏహెచ్‌టీయూ టీం అధికారి జోగిందర్ సింగ్ మాట్లాడుతూ.. బాలికలపై లైంగిక వేధింపులు జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది రమేశ్, గంగన్న, పోలీస్ అధికారులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేషనల్ ట్రైబల్ లీడర్ షిప్ కార్యక్రమానికి సంతోష్


హాజరైన పెందూర్ సంతోష్

నార్నూర్: దేశ వ్యాప్తంగా ట్రైబల్ యువత నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు బెంగళూరులో ఏర్పాటు చేసిన నేషనల్ ట్రైబల్ లీడర్స్ షిప్ కార్యక్రమానికి గాదిగూడ మండలంలోని పున్నగూడ గ్రామానికి చెందిన పెందూర్ సంతోష్ హాజరయ్యారు. ఆదివాసీ యువతను ఒకచోట చేర్చి వారి విజయాలు, వైఫల్యాలు, అనుభవాలను పంచుకునే అవకాశాన్ని నేషనల్ ట్రైబల్ లీడర్స్ షిప్ కల్పిస్తుందన్నారు. ఏజెన్సీలో ఎదుర్కొంటున్న సమస్యలుపై చర్చించడం జరిగిందన్నారు. ఆదివాసీ చట్టాలు, జీవోలపై శిక్షణ నిర్వహించినట్లు తెలిపారు.

బురదరోడ్డుపై వెళ్లేదెలా?

- వర్షం పడితే రాకపోకలు బంద్
- అత్యవసర సమయంలోనూ తప్పని తిప్పలు


బురద రోడ్డుపై ఇరుక్కుపోయిన ఆటో


చిత్తడిగా మారిన రోడ్డుపై కాలినడకన వెళ్తున్న ప్రజలు

నేరడిగొండ: వర్షం కురిస్తే చాలు.. మండలంలోని లక్ష్మీపూర్, అద్దాలతిమ్మాపూర్, పీచర గ్రామాల రోడ్లన్ని చిత్తడిగా మారుతున్నాయి. పూర్తిగా బురదమయంగా మారడంతో వాహనాల రాకపోకలతో పాటు కనీసం కాలినడకన వెళ్లలేని పరిస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రయాణం నరకయాతనగా మారిందని వాపోతున్నారు. మట్టి రోడ్లు పూర్తిగా జారి వాహనాలెక్కడికి కదలలేని స్థితికి చేరాయి. ప్రతీ వర్షాకాలంలో ఇదే పరిస్థితి ఎదురవుతుందని వాపోతున్నారు. గురువారం చిత్తడిగా మారిన రోడ్డుపై ఓ ఆటో కూరుకుపోయింది. దీంతో జనాలు ఆటోను తోస్తూ కనిపించారు. ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు, నిత్యావసరాల కొనుగోలు, అత్యవసర పరిస్థితుల్లో 25 కిలో మీటర్ల దూరంలోని నేరడిగొండ మండల కేంద్రానికి వెళ్లాల్సి ఉంటుంది. అయితే రోడ్ల గుండా వెళ్లడం సవాలుగా మారింది. +వర్షం కురిస్తే ఇంట్లో నుంచి బయటకు అడుగుపెట్టని దుస్థితి నెలకొంటుంది. చిన్న పిల్లలు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా తమ పరిస్థితులు మాత్రం అలాగే ఉండిపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు ప్రతిసారి వాగ్దానాలు చేయడమే తప్పా సమస్యలను పరిష్కరించడం లేదని ఆరోపిస్తున్నారు. వ్యవసాయ పనుల కోసం ఎరువులు, మందులు తీసుకురావాల్సిన అవసరం ఉన్నా, వర్షం కారణంగా రోడ్లు బురదమయంగా మారడంతో వాహనాలు అందులో కూరుకుపోతున్నాయని, అత్యవసర పరిస్థితుల్లో కనీసం ఆస్పత్రికి వెళ్లడం సాధ్యపడడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఓటరు లిస్ట్ సవరణ


సవరిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

నార్నూర్: స్థానిక ఎన్నికలను సెప్టెంబర్ 30లోపు పూర్తి చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నుంచి స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలనే ఆదేశాలు సైతం వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలానికి చెందిన 23 గ్రామ పంచాయతీలకు చెందిన కార్యదర్శులు గత అసెంబ్లీ ఓటర్ లిస్టు స్థానిక ఎన్నికల కోసం వార్డుల వారీగా ఓటర్ లిస్టును సవరించే పనిలో నిమగ్నమయ్యారు. అందులో భాగంగా గ్రూపులుగా ఏర్పడి ఓటరు జాబితాను సవరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వార్డుల వారీగా ఓటర్ జాబితాను సవరించుకుంటున్నామని ఎంపీడీవో గంగాసింగ్ తెలిపారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న నాయకులు


తాంసి మండల కేంద్రంలో..

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా మాజీమంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తాంసి మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు నాయకులు కేక్‌కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రమణ, తదితరులు పాల్గొన్నారు. ఉట్నూర్ ఐబీ చౌరస్తాలో కేక్‌కట్ చేయడంతో పాటు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నిండు నూరేళ్ల ఆయు ఆరోగ్యాలతో ఉండాలని అకాంక్షించారు. తలమడుగు మండలంలోని సాయిలింగి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, కేక్‌కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం జాబ్‌మేళా కరపత్రాలు ఆవిష్కరించారు. బోథ్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మాజీ ఐటీ శాఖ మంత్రి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ సంధ్యారాణి, మండల కన్వీనర్ నారాయణరెడ్డి, నాయకులు కేక్‌కట్ చేశారు. బజార్‌హత్నూర్ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండల యువజన సంఘం అధ్యక్షుడు దుబ్బుల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గురువారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.
జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. అతి తక్కువ కాలంలోనే ఐటీ రంగాన్ని గణనీయంగా అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. భోరజ్ మండల కేంద్రంలో గురువారం మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మొదట కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఇచ్చోడ మండల కేంద్రం అంబేడ్కర్ చౌరస్తాలో కేక్‌కట్ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించారు. మండలంలోని ముఖరా(బి) శ్మశానవాటికలో మొక్కలు నాటారు. నేరడిగొండ మండల కేంద్రంలోని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసంలో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి చేశారు. రాష్ట్ర అభివృద్ధిలో ఆయన పాత్రను ప్రశంసించారు. ఇచ్చోడలో చేపట్టనున్న జాబ్‌మేళా కారపత్రాలు ఆవిష్కరించారు. నార్నూర్ మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద కేక్ కట్ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



మొక్కలు నాటుతున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు అన్నారు. లయన్స్‌క్లబ్ జోన్ చైర్‌పర్సన్ ప్రకాష్ జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గెజిటెడ్ నం.1 పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పెన్నులు అందజేశారు. వృక్షాలతో పర్యావరణం సమతుల్యంగా ఉంటుందన్నారు. ప్రధానోపాధ్యాయురాలు నీలాదేవి, లయన్స్‌క్లబ్ సభ్యులు భగవాన్‌దాస్, దేవన్న, రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

సన్మానం


సోయం బాపూరావును సన్మానిస్తున్న నాయకులు

బోథ్: రాజ్‌గోండు సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపీ సోయం బాపూరావును బోథ్, సొనాల మండల కాంగ్రెస్ నాయకులు గురువారం ఆదిలాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సన్మానించారు. ఆదివాసీ హక్కుల కోసం సోయం బాపూరావ్ ఎంతో పోరాడారని అన్నారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, పొచ్చెర ఆత్మ డైరెక్టర్ కొట్టాల గంగారెడ్డి, చిలుకూరి రమేశ్ రెడ్డి, రామెల్లి భోజన్న, చౌహన్ వినోద్ పాల్గొన్నారు.

- బోథ్ గ్రామాభివృద్ధి కమిటీ కార్యాలయ ఆవరణ ఇటీవల కురిసిన వర్షానికి చిత్తడిగా మారడంతో వీడీసీ సభ్యులు ఉమేష్ దృష్టికి తీసుకువచ్చారు. కాగా వెంటనే స్పందించిన ఉమేష్ ఎర్ర మొరం వేయించి, చదును చేయించాడు. ఈ సందర్భంగా అయనను వీడీసీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో అల్లకొండ పోతన్న, రాయిపెల్లి రమాకాంత్, ఎలుక రాజు, సయ్యద్ యాసిన్, మెడిచేల్మ ప్రవీణ్ పాల్గొన్నారు.

- బోథ్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించిన నూతన సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీసాయిని సొనాల మాజీ సర్పంచ్ చెట్లపల్లి సదానందం గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ జీవన్ కుమార్, ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి కిష్టయ్య, రామాయి, శంకర్, సంతోష్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న సీఐ సాయినాథ్

సాత్నాల: భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పెన్‌గంగ లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ సాయినాథ్ అన్నారు. భోరజ్ మండలంలోని డోలారా, కామాయి, పూసాయి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితులలో డీడీఆర్‌ఎఫ్ బృందాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

త్రీఫేజ్ విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులు


ఇచ్చోడ: మండల కేంద్రంలోని జామిడి ఫీడర్‌లో 20 రోజుల నుంచి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా లేక పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. త్రీఫేజ్ విద్యుత్ సరఫరా లేక పోవడంతో తాగునీటి, ఇతర అవసరాలకు ఇబ్బందులకు గురి అవుతున్నట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు విద్యుత్ అ. దికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు త్రీఫేజ్ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఇంద్రవెల్లి: వైద్య ఆరోగ్య శాఖ, ఐటీడీఏ పీవో కుష్బూగుప్తా ఆదేశాల మేరకు గురువారం మండలంలోని వాల్గొండ గ్రామంలో ఆదివాసీ బిరుదు గొండ్ కళాబృందం కళాకారులు కళాజాత ప్రదర్శన ద్వారా సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. గొండి, మరాఠి, కొలాం భాషలో పాటలు పాడుతూ, నాటికల ప్రదర్శిస్తూ వ్యాధులపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో జ్వరం, మలేరియా, డెంగ్యు, టైఫాయిడ్ రోగాలు వచ్చే అవకాశం ఉంది. వ్యక్తిగతశుభ్రత పాటించాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనారోగ్యానికి గురైతే ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది విజయ సుందరి, కళాజాత బృందం కళాకారులు పెందోర్ జగన్, దత్త, సీను, రాణి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలి


కరాటే శిక్షణ ఇస్తున్న శిక్షకుడు రవి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని ప్రభుత్వ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేశ్‌రెడ్డి అన్నారు. జ్వాల కార్యక్రమంలో భాగంగా గురువారం పాఠశాలలో విద్యార్థులకు కరాటే శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న 120 మంది విద్యార్థినులకు కరాటే శిక్షకుడు రవి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆత్మరక్షణ కోసం కరాటే ఎంతగానో దోహద పడుతుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు సార, సులోచన, రాణి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ పేదల పక్షాన పోరాడే పార్టీ


మాట్లాడుతున్న ముడుపు ప్రభాకర్‌రెడ్డి

సాత్నాల: పేదల పక్షాన పోరాడే పార్టీ సీపీఐ అని ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. భోరజ్ మండలం పెండల్‌వాడ గ్రామంలో గురువారం మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులకు మూడెకరాల భూమి, పేదల పక్షాన పోరాడి పక్కా గృహాలు, ఇంటి స్థలాలు, సీపీఐ పోరాటం వల్లే సాధ్యమైందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెత్తందారులకు, కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. రైతులకు గిట్టుబాటుల ధరలు లేవని, నిరుద్యోగ యువకులకు ఉద్యోగ అవకాశాలు లేవన్నారు. కార్యక్రమంలో గద్దం భూపతిరెడ్డి, కుంటాల రాములు, చిన్నయ్య, సోమన్న, రామచందర్, అరికల గజారాం, బోయర్ జగన్నాథ్, ఇందూర్ నందు, ఆకుల వెంకన్న పాల్గొన్నారు.

‘ప్రభుత్వం ఇవ్వకున్నా.. కేసీఆర్ కిట్లు ఇస్తాం’


కేసీఆర్ కిట్లు అందజేస్తున్న తుల శ్రీనివాస్

బోథ్: ప్రభుత్వం బాలింతలకు కేసీఆర్ కిట్లు ప్రభుత్వం ఇవ్వడం లేదని, ప్రభుత్వం ఇవ్వకున్నా.. తాము బాలింతలకు కేసీఆర్ కిట్లు అందజేస్తామని మాజీ ఎంపీపీ, తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు తుల శ్రీనివాస్ అన్నారు. గురువారం సొనాల మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆసుపత్రిలో బాలింతలకు కేసీఆర్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ జన్మదినం సందర్భంగా మహిళలతో కలిసి కేక్‌కట్ చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో బాలింతల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని కేసీఆర్ కిట్లు అందించేవారని, ప్రస్తుతం ప్రభుత్వం ఈ పథకాన్ని తొలగించాలన్నారు. తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా కేసీఆర్ కిట్ల పంపిణీ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ ఇర్ల అభిలాష్, సుధీర్ రెడ్డి, చిన్నయ్య, హరీశ్, భీంరావు పాటిల్, సోమన్న, అల్లకొండ ప్రశాంత్, శ్రీధర్ రెడ్డి, సురేందర్ యాదవ్ పాల్గొన్నారు.

పొన్నలో స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే


స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే పరిశీలిస్తున్న అధికారులు

సిరికొండ: మండలంలోని పొన్న గ్రామంలో గురువారం స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేను అధికారులు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి క్షేత్రస్థాయిలో ఇండ్లు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రత ద్వారానే ఆరోగ్యంగా ఉంటామని ఎంపీడీవో రవీందర్ అన్నారు. పరిసరాల్లో చెత్త, ప్లాస్టిక్ వంటి వ్యర్థ పదార్థాలు వేయకుండా డంపింగ్ యార్డులకు తరలించాలన్నారు. ఎస్ఎస్‌జీ టీం పద్మ, ఎస్‌బీఎం కోఆర్డినేటర్ జాదవ్ సంపత్, పంచాయతీ కార్యదర్శి అజ్మత్, అంగన్‌వాడీ, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని అణిచివేసే శక్తి భారత్‌కు ఉంది



మాట్లాడుతున్న అరవింద్ కుమార్


హాజరైన విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: ఉగ్రవాదులకు దీటుగా బదులిచ్చి వారిని అణిచివేసే శక్తి భారత్‌కు ఉందని ఎన్‌సీసీ 32 బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ అరవింద్ కుమార్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని నలంద డిగ్రీ కళాశాలలో ఆపరేషన్ సింధూర్‌పై రూపొందించిన లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 22న పహల్గాంలో భారతీయులపై జరిగిన దాడుల నుంచి మే 6 వరకు జరిగిన పాకిస్థాన్ ఉగ్ర స్థావరాలపై భారత్ జరిపిన భీకర దాడులను లఘుచిత్రంలో ప్రదర్శించారు. యువత దేశభక్తిని పెంపొందించుకోవడంతో పాటు భావితర సైనికులుగా ఎదగాలని సూచించారు. ఎన్‌సీసీ ఇందుకు క్రియాశీలకంగా కార్యక్రమాలను నిర్వహిస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్ జరిగే ఉగ్రదాడులు, వాటిని ఎదుర్కొనే నైతిక శక్తి సామర్థ్యాల గురించి విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ పున్నరావు, లక్ష్మణ్, భూమన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోవాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇచ్చోడ: ఇచ్చోడ మండల కేంద్రంలో ఈనెల 26న నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగ యవత సద్వినియోగం చేసుకోవాలని బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బోథ్ నియోజకవర్గ యువతీ, యువకులు హాజరై ఉద్యోగాలు పొందాలన్నారు. ఇచ్చోడ మండల కేంద్రంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు జాబ్‌మేళా కొనసాగనున్నట్లు తెలిపారు.
భీంపూర్: ఈనెల 26న ఇచ్చోడ మండల కేంద్రంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని మాజీ జెడ్పీటీసీ కుమ్ర సుధాకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. స్థానిక యువత జాబ్‌మేళాలో పాల్గొని ఉద్యోగ అవకాశాలు పొందాలన్నారు.

సర్వీస్ రోడ్లపై పార్కింగ్ సమస్య



నేరడిగొండ మండల కేంద్రంలోని సర్వీస్ రోడ్లపై వాహనాలు ఇరువైపులా పార్క్ చేయడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు చిక్కుల్లో పడుతున్నారు. మార్కెట్ ప్రాంతం కావడంతో ఇక్కడి రద్దీ రోజురోజుకు పెరుగుతోంది. పార్కింగ్ స్థలం లేకపోవడంతో వాహనదారులు రోడ్డు పక్కనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు కదలలేని పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. – నేరడిగొండ